RNI NO. TELTEL2010/34557
www.deshatimes.in

# దేశ టైమ్స్ DESHA TIMES

తెలుగు దిన పత్రిక
నిజం.. నిర్భయం.. నిరంతరం

నల్గొండ | సెప్టెంబర్ 13 ఆదివారం 2026 | సంపుటి : 16 | సంచిక : 220 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : సయ్యద్ పాష

NALGONDA | SUNDAY SEPTEMBER 13 2026 | VOL:16 | ISSUE: 220 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:SAYED PASHA

దేశ టైమ్స్
DESHA TIMES
16 సంవత్సరాలుగా వెలువడుతున్న "దేశ టైమ్స్" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9849758280




- విదేశాల్లో చదివే విద్యార్థులకు పెండింగ్ స్కాలర్‌షిప్ నిధులు విడుదల
- మొత్తం 3,008 మంది విద్యార్థులకు రూ.179.9 కోట్ల కేటాయింపు
- మైనారిటీ విద్యార్థులకు అత్యధికంగా రూ.76.1 కోట్ల విడుదల
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలతో ఆర్థిక శాఖ చర్యలు
- ఎస్సీ,ఎస్టీ, బీసీ విద్యార్థులకు కూడా నిధుల పంపిణీ పూర్తి

తెలంగాణ ప్రభుత్వం విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు భారీ ఊరట కల్పించింది. పెండింగ్‌లో ఉన్న ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల కోసం రూ.179.9 కోట్లను తాజాగా విడుదల చేసింది. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ నిధుల కేటాయింపు జరిగింది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,008 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.విడుదలైన నిధుల్లో అత్యధికంగా ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద 1,063 మంది మైనారిటీ విద్యార్థులకు రూ.76.1 కోట్లు కేటాయించారు. అలాగే, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి ద్వారా 1,193 మంది ఎస్సీ విద్యార్థులకు రూ.48.4 కోట్లు, 573 మంది ఎస్టీ విద్యార్థులకు రూ.36.9 కోట్లు, మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యా నిధి కింద 179 మంది బీసీ విద్యార్థులకు రూ.18.4 కోట్లు అందజేయనున్నారు. ఇప్పటికే స్కాలర్‌షిప్‌లు మంజూరైన లబ్ధిదారులందరికీ చెల్లింపులు పూర్తయ్యాయని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల్లో తమ చదువును ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగించేందుకు ఈ నిధులు దోహదపడతాయని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.

## బీఆర్ఎస్ నేతలపై కేసులు.. మరి మిస్ ఇంగ్లాండ్ వ్యవహారం ఏమైంది?: కేటీఆర్

- బీఆర్ఎస్ నేతలపై కేసులపై కేటీఆర్ స్పందన
- కేసులను కోర్టుల్లో ఎదుర్కొంటామని వెల్లడి
- మిస్ ఇంగ్లాండ్ ఆరోపణలపై డీజీపీకి ప్రశ్న
- తెలంగాణ పోలీసులు నిందితులను కాపాడుతున్నారా? అని నిలదీత

మిల్లా మ్యాగీ ఆరోపణలతో గతంలో రాజకీయ దుమారం

అసెంబ్లీ ప్రాంగణంలో ఇటీవల జరిగిన గందరగోళం నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై లైంగిక వేధింపుల కేసులు నమోదు చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ కేసులను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటామని చెప్పారు. అయితే హైదరాబాద్‌లో జరిగిన మిస్ వరల్డ్ పోటీల సందర్భంగా మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ చేసిన ఆరోపణలపై ఏం చర్యలు తీసుకున్నారని రాష్ట్ర డీజీపీని ప్రశ్నించారు."ఈ చెత్త కేసును మేం కోర్టుల్లో ఎదుర్కొంటాం. కానీ హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీల సమయంలో మిస్ ఇంగ్లాండ్‌తో అభ్యంతరకరంగా ప్రవర్తించిన

(మిగతా 2వ పేజీలో..)



## ధరణి పేరుతో బీఆర్ఎస్ భూదందా: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

- బీఆర్ఎస్ హయాంలో ధరణి పేరుతో లక్షల ఎకరాల అక్రమాలు
- బండారం బయటపడుతుందనే బీఆర్ఎస్ నేతలు పారిపోతున్నారు
- పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబమే బాగుపడింది
- అసెంబ్లీలో మంత్రి తీవ్ర ఆగ్రహం



గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని లక్షలాది

(మిగతా 2వ పేజీలో..)

## బర్తరఫ్ తర్వాత కీలక పరిణామం.. కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు

- మంత్రి పదవి కోల్పోయిన కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు
- కేబినెట్ స్థాయి పదవి ఇచ్చే యోచనలో అధిష్ఠానం ఉన్నట్లు సమాచారం
- సురేఖతో నేరుగా మాట్లాడిన తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్



(మిగతా 2వ పేజీలో..)

## న్యూఢిల్లీ డిక్లరేషన్‌ను ఏకగ్రీవంగా ఆమోదించిన బ్రిక్స్... దౌత్యపరంగా భారత్‌కు అద్భుత విజయం

భారతదేశానికి దౌత్యపరంగా మరో అద్భుత విజయం దక్కింది. భారత్ అధ్యక్షతన జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో న్యూఢిల్లీ డిక్లరేషన్‌కు ఏకగ్రీవ ఆమోదం లభించింది.బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో తొలిరోజు చర్చల ముగింపులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ... న్యూఢిల్లీ డిక్లరేషన్ ఆమోదం పొందినట్టుగా ప్రకటించారు. "ఏ సభ్య దేశం కూడా ఎలాంటి అభ్యంతరం లేవనెత్తలేదు. న్యూఢిల్లీ డిక్లరేషన్ 2026 ఏకగ్రీవంగా ఆమోదించబడింది" అని ప్రధాని మోదీ తెలిపారు.బ్రిక్స్ సభ్య దేశాలైన ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈల మధ్య పశ్చిమాసియా వివాదంపై తీవ్ర విభేదాలు నెలకొన్నాయి. అయితే వీటన్నింటిని అధిగమించి బ్రిక్స్ కూటమి శనివారం ఏకాభిప్రాయంతో ఈ డిక్లరేషన్ ప్రకటనను ఆమోదించింది.అయితే న్యూఢిల్లీ డిక్లరేషన్ ఏకగ్రీవంగా ఆమోదం పొందడంలో భారత్ తన దౌత్య నైపుణ్యాన్ని ప్రదర్శించింది. ఎందుకంటే ఏ ఒక్క సభ్య దేశం కూడా ఈ డిక్లరేషన్‌పై ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదు. అయితే ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం...ఈ డిక్లరేషన్‌కు సంబంధించిన చర్చలు తెల్లవారుజామున 4 గంటల వరకు కొనసాగాయి .




(మిగతా 2వ పేజీలో..)

RNI NO . TELTEL2010/34557 తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## బీఆర్ఎస్ నేతలపై కేసులు.. మరి మిస్ ఇంగ్లాండ్ వ్యవహారం ఏమైంది?: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ నాయకులపై ఆమె చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలు ఏమయ్యాయి?" అని కేటీఆర్ ప్రశ్నించారు. నిందితులను తెలంగాణ పోలీసులు ఇంకా కాపాడుతున్నారా? దీనిపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ వద్ద సమాధానం ఉందా? అని నిలదీశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. అసెంబ్లీ గేటు ముందు జరిగిన గందరగోళం నేపథ్యంలో ముఖ్యమంత్రి తన పోలీసులతో బీఆర్ఎస్ నేతలపై లైంగిక వేధింపుల కేసులు నమోదు చేయించడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమేనని కేటీఆర్ ఆరోపించారు. 2025లో తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించింది. ఈ పోటీలపై మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లో ఉన్న సమయంలో ధనవంతులైన పురుష స్పాన్సర్లను అలరించాలంటూ తనపై తీవ్ర ఒత్తిడి తెచ్చారని మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్‌పై ఆరోపించారు. "మేం పోటీలకు వచ్చామో, దేనికి వచ్చామో అర్థం కాలేదు. ఇవేం పోటీలు?" అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు.తనకు ఎదురైన అసౌకర్యంతో మిస్ వరల్డ్ 2025 పోటీల నుంచి మ్యాగీ అర్థాంతరంగా వైదొలిగి ఇంగ్లాండ్‌కు వెళ్లిపోయారు. స్వదేశానికి చేరుకున్న తర్వాత ఆమె చేసిన వ్యాఖ్యలు తెలంగాణలో రాజకీయ దుమారానికి దారితీశాయి. అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. మ్యాగీ ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం సైతం సీనియర్ ఐపీఎస్ అధికారి నేతృత్వంలో విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే తాజా పరిణామాలపై కేటీఆర్ ప్రశ్నలు సంధించారు.

## బర్తరఫ్ తర్వాత కీలక పరిణామం.. కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి పదవి నుంచి బర్తరఫ్ అయిన కొండా సురేఖ వ్యవహారంలో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. ఆమెకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఢిల్లీకి రావాల్సిందిగా పిలుపు అందింది. వెంటనే బయలుదేరి రావాలని పార్టీ పెద్దల నుంచి ఆమెకు సందేశం అందినట్లు తెలుస్తోంది. మంత్రివర్గం నుంచి తొలగించిన మరుసటి రోజే హైకమాండ్ రంగంలోకి దిగడం తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తి రేపుతోంది.నిన్న తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, కొండా సురేఖతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడారు. పార్టీ నిర్ణయాన్ని గౌరవించాలని, అధిష్ఠానం అండగా ఉంటుందని ఆమెకు హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ సంభాషణ జరిగిన కొద్ది గంటల్లోనే ఢిల్లీ నుంచి పిలుపు రావడం గమనార్హం.మంత్రి పదవి కోల్పోయి అసంతృప్తితో ఉన్న కొండా సురేఖను బుజ్జగించేందుకే అధిష్ఠానం ఈ చర్యలు చేపట్టినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఆమెకు కేబినెట్ స్థాయి పదవిని అప్పగించే యోచనలో కాంగ్రెస్ పెద్దలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అధిష్ఠానం పిలుపు మేరకు కొండా సురేఖ ఢిల్లీ పర్యటన తర్వాత ఈ వ్యవహారంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## తెలంగాణలో ఆగని వానలు.. మరో వారం పాటు వర్ష సూచన

**తెలంగాణలో మరో వారం పాటు వర్షాలు కొనసాగింపు**

**రానున్న 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్ష సూచన**

**ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో కుండపోత వానల అంచనా**

**సీజనల్ వ్యాధులపై ప్రజారోగ్య శాఖ ప్రత్యేక హెచ్చరికలు జారీ**

**హైదరాబాద్‌లోనూ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం**

తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ హెచ్చరికలు జారీ చేసింది.ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. వీటితో పాటు నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్ నగరంలోనూ మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయి.

ఆరోగ్య శాఖ హెచ్చరిక వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో తేమ శాతం పెరగడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ హెచ్చరించింది. ప్రధానంగా దోమలు, కలుషిత నీరు, గాలి ద్వారా వ్యాపించే అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. దోమతెరలు వాడటం, నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడటం, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరింది. ఎవరికైనా ఫ్లూ లక్షణాలు కనిపిస్తే జాప్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు స్పష్టం చేశారు.



## ధరణి పేరుతో బీఆర్ఎస్ భూదందా: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

ఎకరాల భూములను ఆక్రమించిందని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. శనివారం శాసనసభలో 22-ఏ నిషేధిత భూములపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల ఆస్తులకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించడమే తమ ప్రభుత్వ రెవెన్యూ సంస్కరణల ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ రెవెన్యూ శాఖను తన వద్దే ఉంచుకుని భూ అక్రమాలకు పాల్పడ్డారని పొంగులేటి విమర్శించారు. రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాల భూమిని తమ సొంత ఆస్తిగా భావించి గత ప్రభుత్వం పాలన సాగించిందని దుయ్యబట్టారు. ధరణి పోర్టల్ నిర్వహణను దివాలా తీసిన ఒక విదేశీ కంపెనీకి అప్పగించారని, పోర్టల్‌పై ఉన్న నియంత్రణను దుర్వినియోగం చేస్తూ అర్ధరాత్రి వేళల్లో రిజిస్ట్రేషన్లు చేశారని ఆరోపించారు. పోర్టల్‌లోని సాంకేతిక లోపాల వల్ల లక్షలాది మంది రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చిందని, ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై వందలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం, వారి బంధువులు మాత్రమే లబ్ధి పొందారని, సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. శాసనసభ సాక్షిగా తమ అక్రమాలు బయటపడుతుండటంతోనే గత పాలకులు చర్చ నుంచి పారిపోతున్నారని పొంగులేటి ఎద్దేవా చేశారు. భూ పరిపాలన, ధరణి పోర్టల్ అంశాలపై సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.



## న్యూఢిల్లీ డిక్లరేషన్‌ను ఏకగ్రీవంగా ఆమోదించిన బ్రిక్స్... దౌత్యపరంగా భారత్‌కు అద్భుత విజయం

(మొదటి పేజీ తరువాయి)

ఆ తర్వాత అన్ని పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. బ్రిక్ కూటమిలో డిక్లరేషన్ ఆమోదం పొందడం అంత తేలికైన విషయం కాదు. ఎందుకంటే బ్రిక్స్ అనేది ఏకాభిప్రాయం ఆధారిత కూటమి... అంటే ఏ ఒక్క సభ్య దేశమైనా తుది జాయింట్ డిక్లరేషన్‌ను అడ్డుకోగలదు.ఇక, వాస్తవానికి ఈ జాయింట్ డిక్లరేషన్‌కు సంబంధించి అనేక సున్నితమైన, వివాదాస్పద అంశాలపై బ్రిక్స్ దేశాల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. వివిధ దేశాల వ్యూహాత్మక, భౌగోళిక రాజకీయ ప్రయోజనాల కారణంగా చర్చలు సుదీర్ఘంగా సాగాయి. అందువల్ల ఏకాభిప్రాయాన్ని సాధించే ప్రయత్నంలో భాగంగా భారతదేశం అన్ని పక్షాలతో నిరంతరం సంప్రదింపులు జరిపింది.ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా అటు ఇరాన్‌తో సౌదీ అరేబియా, యూఏఈల మధ్య విభేదాలు ఉన్న సంగతి తెలిసిందే. పశ్చిమ ఆసియాకు సంబంధించిన అనేక ప్రాంతీయ, భౌగోళిక రాజకీయ సమస్యలపై ఈ దేశాల వైఖరులలో తీవ్రమైన విభేదాలు ఉన్నాయి. దీంతో ఈ దేశాలను జాయింట్ డిక్లరేషన్‌కు అంగీకరించేలా చేయడం భారతదేశానికి ఒక పెద్ద దౌత్యపరమైన సవాలుగా మారింది. వివిధ సమస్యలపై భిన్నమైన వైఖరులు ఉన్నప్పటికీ.. భారతదేశం చర్చల ద్వారా ఒక మధ్యేమార్గాన్ని కనుగొనడానికి ప్రయత్నించింది. ఈ క్రమంలోనే న్యూఢిల్లీ డిక్లరేషన్ ఆమోదంలో భారత్ సాధించిన దౌత్యపరమైన పురోగతిని చాలా ముఖ్యమైనదిగా పరిగణిస్తున్నారు.ఇదిలాఉంటే, మారుతున్న ప్రపంచాన్ని కాలం చెల్లిన సంస్థలతో నడిపించలేమని బ్రిక్స్ సమావేశంలో ఈరోజు జరిగిన చర్చ స్పష్టం చేస్తుంది. ప్రాతినిధ్యం, స్పందన, నియమాల రూపకల్పనలో సంస్కరణలు అత్యవసరంఅని ప్రధాని మోదీ తొలి రోజు తన ముగింపు ప్రసంగంలో పేర్కొన్నారు. భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధిలోనూ, వాటిని నియంత్రించే నియమాలలోనూ గ్లోబల్ సౌత్‌కు సమాన భాగస్వామ్యం ఉండాలని ఆకాంక్షించారు. నిర్ణయాలకు, వాటి ఫలితాలకు మధ్య ఉన్న అంతరాన్ని భాగస్వామ్యం, సామూహిక చర్యల ద్వారా పూడ్చాలనిఅన్నారు. "ఈ రోజు ఆమోదించిన న్యూఢిల్లీ ప్రకటన మన ఉమ్మడి సంకల్పానికి స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుంది. ఈ తీర్మానాలను స్పష్టమైన ఫలితాలుగా మార్చడం ఇప్పుడు మన బాధ్యత" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.




## ఖైరతాబాద్ వినాయకుడు.. నేటి నుంచి 24వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు

**భక్తుల దర్శనానికి సిద్ధమవుతున్న ఖైరతాబాద్ వినాయకుడు**

**భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ ఆంక్షలు**

**ఉత్సవాలు పూర్తయ్యేంత వరకు భక్తులు సహకరించాలని కోరిన పోలీసులు**

హైదరాబాద్‌లో అత్యంత ప్రసిద్ధి చెందిన ఖైరతాబాద్ బడా గణేశ్ విగ్రహ ప్రతిష్ఠాపన, నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాయింట్ కమిషనర్ (ట్రాఫిక్) జోయల్ డేవిస్ కీలక ఆంక్షలు ప్రకటించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ నెల 12వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఖైరతాబాద్ పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలపై ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉంటాయని స్పష్టం చేశారు.

ప్రధాన ట్రాఫిక్ మళ్లింపు వివరాలు:

రాజీవ్‌గాంధీ విగ్రహం జంక్షన్: పీవీ విగ్రహం వైపు నుంచి రాజీవ్‌గాంధీ విగ్రహం మీదుగా మింట్‌కాంపౌండ్ వైపు వెళ్లే వాహనాలను రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నిరంకారి జంక్షన్ వైపు మళ్లిస్తారు. రాజ్‌దూత్ లేన్: రాజ్‌దూత్ లేన్ మీదుగా బడా గణేశ్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను ఇక్బాల్ మినార్ వైపు పంపిస్తారు.

మింట్ కాంపౌండ్: మింట్ కాంపౌండ్ మీదుగా ఐమాక్స్ వైపు వెళ్లే వాహనాలను మింట్ కాంపౌండ్ లైన్ వద్ద సెక్రటేరియట్ ఎక్స్ రోడ్డు వైపు, మింట్ కాంపౌండ్ వైపు వెళ్లే వాహనాలను నెక్లెస్ రోటరీ వద్ద సెక్రటేరియట్ జంక్షన్ లేదా ఖైరతాబాద్ ఫ్లైఓవర్ వైపు మళ్లిస్తారు.

ఖైరతాబాద్ పోస్ట్‌ఆఫీస్ దారి: ఖైరతాబాద్ పోస్ట్‌ఆఫీస్ లేన్ మీదుగా రైల్వేగేటు



వైపు వెళ్లే వాహనాలను పోస్ట్‌ఆఫీసు జంక్షన్ వద్ద పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్ జంక్షన్ వైపు పంపిస్తారు.

భక్తుల వాహనాలకు కేటాయించిన పార్కింగ్ స్థలాలు:

నెక్లెస్ రోటరీ, ఎన్టీఆర్ గార్డెన్ వైపు నుంచి వచ్చే భక్తుల వాహనాలను రేస్ కోర్సు రోడ్, ఎన్టీఆర్ ఘాట్, ఐమ్యాక్స్ థియేటర్ పక్కన ఉన్న హెచ్ఎండీఏ పార్కింగ్ స్థలంతో పాటు ఐమ్యాక్స్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో పార్క్ చేయాల్సి ఉంటుంది. అలాగే ఖైరతాబాద్ జంక్షన్ వైపు నుంచి వచ్చే వాహనాలను విశ్వేశ్వరయ్య భవన్ ప్రాంగణంలో పార్కింగ్ చేయాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. గణేశ్ నిమజ్జన ఉత్సవాలు పూర్తయ్యే వరకు వాహనదారులు, భక్తులు ఈ ఆంక్షలకు సహకరించాలని కోరారు.

RNI NO . TELTEL2010/34557
తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం



# రాజీ మార్గమే రాజమార్గం.. రాజీ పడే అవకాశం ఉన్న అన్ని కేసుల్లో పరిష్కారం పొందవచ్చు: జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. నాగరాజు













**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 12 (దేశ టైమ్స్):**

రాజీ మార్గమే రాజమార్గమని, రాజీ పడదగ్గ కేసుల్లో ఇరుపక్షాలు పరస్పర అంగీకారంతో పరిష్కారం పొందడం ద్వారా సత్వర న్యాయం పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 3వ జాతీయ లోక్ అదాలత్ను శనివారం ఖమ్మం న్యాయ సేవా సదన్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో మొత్తం 15 లోక్ అదాలత్ బెంచ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఖమ్మం హెడ్‌క్వార్టర్‌లో 9, సత్తుపల్లిలో 3, మధిరలో 3 బెంచ్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు వేగంగా, సమర్థవంతంగా న్యాయం అందించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. సివిల్ కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, మోటార్ వాహన ప్రమాద పరిహార కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ, వైవాహిక వివాదాలు, ప్రీ-లిటిగేషన్ కేసులు, వినియోగదారుల వివాదాలు తదితర రాజీపడదగ్గ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ప్రాచీన కాలం నుంచే మన సంస్కృతిలో సామరస్యపూర్వక పరిష్కార వ్యవస్థలు ఉన్నాయని, లోక్ అదాలత్ ద్వారా వివాదాలను త్వరగా, తక్కువ ఖర్చుతో పరిష్కరించుకోవచ్చని అన్నారు. కోర్టు ఫీజులు చెల్లించి ఉంటే వాటిని సంబంధిత పక్షాలకు తిరిగి చెల్లిస్తామని తెలిపారు. లోక్ అదాలత్ తీర్పుకు సివిల్ కోర్టు డిక్రీతో సమానమైన చట్టబద్ధత ఉంటుందని పేర్కొన్నారు. లోక్ అదాలత్ ద్వారా సమయం, ధనం ఆదా కావడంతో పాటు కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ కూడా తగ్గుతుందని, ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన విన్-విన్ పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఇరుపక్షాల అంగీకారంతో తీర్పు వెలువడటం వల్ల మళ్లీ ఉన్నత న్యాయస్థానాల్లో అప్పీలు చేసుకునే అవసరం ఉండదని తెలిపారు. గతంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లలో ఖమ్మం జిల్లా న్యాయశాఖ, పోలీసు విభాగం, న్యాయవాదుల సమన్వయంతో తెలంగాణ రాష్ట్రంలోనే 5వ ర్యాంకు సాధించిందని గుర్తుచేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ వంటి మెట్రోపాలిటన్ ప్రాంతాలతో పోటీపడి ఈ స్థాయిని సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌తో శాశ్వత పరిష్కారం: పోలీస్ కమిషనర్ సునీల్ దత్ కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, సమాజంలో వివాదాలను పరస్పర అవగాహన, ఒప్పందాల ద్వారా పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ అత్యంత ప్రాముఖ్యమైన వేదిక అని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల బాధితులకు, ఇరువర్గాలకు సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు చట్టబద్ధమైన శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. చిన్నచిన్న వివాదాలను ఇరుపక్షాలు కూర్చొని చర్చించుకోవడం ద్వారా న్యాయస్థానాలపై కేసుల భారం తగ్గుతుందని అన్నారు. పోలీసు శాఖ, బార్ కౌన్సిల్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయాధికారులు సమన్వయంతో పనిచేసి గరిష్ట సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని సూచించారు. గత లోక్ అదాలత్‌లో దాదాపు 5,800 కేసులు పరిష్కారం కాగా, ప్రస్తుతం 7,800 కేసులు పరిష్కారానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ సంఖ్యను 10,000కు పైగా తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివాదాలను స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్‌లో పరిష్కారమైన కేసులకు సంబంధించిన చెక్కులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. నాగరాజు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కోర్టు న్యాయమూర్తి వీ. శీనయ్య, ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి పి.పి. కృష్ణార్జున్, కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి మహేష్ నాథ్, బార్ కౌన్సిల్ సభ్యులు ఎం. శ్రీనివాస రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యడ్లపల్లి రమేష్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దేవీ మానస, న్యాయమూర్తులు కల్పన, శివరంజని, మురళీమోహన్, జ్యోతిర్మయి, రజని, బిందుప్రియ, ప్రవీణ్, నాగలక్ష్మి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్యానెల్ అడ్వకేట్లు, వివిధ శాఖల అధికారులు, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మరిపెడలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్






**2 కార్లు.. 2 బైక్‌లు సీజ్**

**500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం.. 20 లీటర్ల నాటుసారా స్వాధీనం**

**దేశ టైమ్స్ మహబూబాబాద్‌మరిపెడ, సెప్టెంబర్ 12:**

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు గ్రామాల్లో శాంతిభద్రతలను కాపాడేందుకు మరిపెడ సర్కిల్ పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ శభరీష్ పి.ఎస్.ఆర్ ఆదేశాల మేరకు మరిపెడ సీఐ ఎల్. పవన్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజామున గుర్రప్పతండా, లచ్చతండా, తండా ధర్మారం గ్రామాల్లో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ఆయా గ్రామాల్లోని అనుమానాస్పద ఇళ్లు, పరిసర ప్రాంతాలతో పాటు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనాల పత్రాలను పరిశీలించగా సరైన ధ్రువపత్రాలు లేని రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అక్రమ మద్యం తయారీకి సంబంధించిన కార్యకలాపాలపై కూడా పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. తనిఖీల్లో అక్రమ నాటుసారా తయారీకి ఉపయోగిస్తున్న సుమారు 500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేయడంతో పాటు 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. దీనికి బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. గ్రామాల్లో నాటుసారా తయారీ, విక్రయాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు అవగాహన కార్డన్ అండ్ సెర్చ్ అనంతరం పోలీసులు గ్రామస్తులతో సమావేశమై పలు అంశాలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలపై ప్రజలకు వివరించారు. అలాగే సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు, లింకులను నమ్మవద్దని, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, ఏటీఎం, పాస్‌వర్డ్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు వెల్లడించవద్దని సూచించారు. మత్తు పదార్థాలు, నాటుసారా వినియోగం వల్ల వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబాలపై, సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గ్రామాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ తనిఖీల్లో మరిపెడ ఎస్ఐ గంధ్రాతి సతీష్, ఎస్ఐ మైబూబీ, సీరోల్ ఎస్ఐ సంతోష్, చిన్నగూడూరు ఎస్ఐ కుశకుమార్, ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డితో పాటు సుమారు 40 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం తనిఖీలు కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు.

# స్థానిక షైన్ హైస్కూల్‌లో ఘనంగా వినాయక చవితి వేడుకలు





**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 12 (దేశ టైమ్స్):**

స్థానిక షైన్ హైస్కూల్‌లో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు సాంప్రదాయ వస్త్రధారణలో సందడి చేస్తూ అందరినీ అలరించారు. విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శిస్తూ మట్టి, కూరగాయలు, ఆకుకూరలు, ఆకులు, పండ్లతో వివిధ రకాల వినాయక విగ్రహాలను తయారు చేసి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ షేక్ అన్సర్ పాషా మాట్లాడుతూ, వినాయక చవితి హిందువులకు ఎంతో ముఖ్యమైన పండగ అని అన్నారు. అన్ని విఘ్నాలు తొలగాలని కోరుతూ విఘ్నేశ్వరుడిని ప్రథమంగా పూజించడం ఆనవాయితీ అని తెలిపారు. పాఠశాల డైరెక్టర్ షేక్ లాల్ మహమ్మద్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని, పర్యావరణానికి హాని కలిగించని విధంగా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి పూజించాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపల్ అయిటి పాముల శ్వేత మాట్లాడుతూ, పిల్లలు వినాయకుడికి ఎంతో ప్రీతిపాత్రులని, వారి చేతులతో వినాయక విగ్రహాలను తయారు చేయడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. విద్యార్థులందరూ ఎంతో ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొని విగ్రహాలను తయారు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ షేక్ అన్సర్ పాషా, డైరెక్టర్ షేక్ లాల్ మహమ్మద్, ప్రిన్సిపల్ అయిటి పాముల శ్వేత, అడ్మినిస్ట్రేటర్ దేగల వేలాద్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య స్కూల్ మామిళ్లగూడెం బ్రాంచ్‌లో ఘనంగా గణేష్ చతుర్థి వేడుకలు






**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 12 (దేశ టైమ్స్):**

శ్రీ చైతన్య స్కూల్ మామిళ్లగూడెం బ్రాంచ్‌లో గణేష్ చతుర్థి వేడుకలను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పర్యావరణహిత గణపతి విగ్రహాలను తయారు చేసి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. మట్టి, సహజసిద్ధమైన పదార్థాలతో రూపొందించిన ఎకో ఫ్రెండ్లీ గణపతి విగ్రహాల ద్వారా ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగుల వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలపై విద్యార్థులు చక్కటి సందేశాన్ని అందించారు. విద్యార్థుల సృజనాత్మకతను ప్రోత్సహిస్తూ, సంప్రదాయాలను పాటిస్తూనే ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం చేతన్, ప్రిన్సిపాల్ నీరజ, కోఆర్డినేటర్లు, ప్రైమరీ ఇన్‌చార్జ్ కల్యాణి, ప్రీ-ప్రైమరీ ఇన్‌చార్జ్ గీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మధు యాష్కిని ఘనంగా సన్మానించిన జువ్వడి కృష్ణారావు

**కోరుట్ల,సెప్టెంబర్ 12 ( దేశ టైమ్స్)**



అఖిలభారత కాంగ్రెస్ కమిటీ ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్ గా నియామకమైన మాజీ లోక్ సభ సభ్యుడు మధుయాష్కి ని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వడి కృష్ణారావు శనివారం రోజున ఘనంగా సన్మానించారు. హైదరాబాదులోని మధు యాష్కి నివాసంలో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ప్రొఫెషనల్ చైర్మన్ గా నియామకమైన సందర్భంగా మొదటిసారి హైదరాబాద్ వచ్చిన మధు యాష్కిని శాలువాతో ఘనంగా సన్మానించి పుష్ప గుచ్ఛం అందజేశారు..

RNI NO . TELTEL2010/34557 తెలుగు దినపత్రిక

దేశ టైమ్స్

సత్యం కోసం .... సమాజం కోసం

## కబడ్డీ క్రీడల్లో విజేతలుగా గాయత్రి స్కూల్ విద్యార్థులు

**వలిగొండ సెప్టెంబర్ 12 (దేశ టైమ్స్) :**




మండలకేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి క్రీడోత్సవాలు ఘనంగా ముగిశాయి. అండర్ 17 కబడ్డీలో స్థానిక గాయత్రి పాఠశాల విద్యార్థులు విజేతలుగా గెలుపొందిన విజేతలకు పాఠశాల యజమాన్యం అభినందించింది బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ నరహరి మాట్లాడుతూ. క్రీడలు విద్యార్థుల్లో శారీరక మానసిక క్రమశిక్షణ నేర్పిస్తుందని, క్రీడలు మానసిక ఉల్లాశానికి దోహద పడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పడమటి మురళీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బిమిడి యాదిరెడ్డి, ప్రిన్సిపాల్ కొంతము బిక్షపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాలకూర వెంకటేష్, ఉపాధ్యాయులు బిమిడి కవిత, జక్క నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

**డీజేలకు అనుమతి లేదు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: సిఐ మొగులూరు రవి**

**వలిగొండ, సెప్టెంబర్ 12 (దేశ టైమ్స్):**




గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని రామన్నపేట సీఐ మొలుగూరి రవి, వలిగొండ ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి సూచించారు. యాదాద్రి-భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు వలిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజేలకు ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసుల సూచనలు పాటిస్తూ ఉత్సవాలను నిర్వహించుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

## మండల స్థాయి క్రీడల్లో టేకులసోమారం విద్యార్థుల సత్తా

**వలిగొండ, సెప్టెంబర్ 12 (దేశ టైమ్స్):**



మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఈ నెల 9, 10, 11 తేదీల్లో నిర్వహించిన 70వ మండల స్థాయి పాఠశాలల క్రీడోత్సవాలల్లో భాగంగా టేకులసోమారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. కబడ్డీ, వాలీబాల్, చెస్ పోటీల్లో సత్తా చాటి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. కబడ్డీలో 17 సంవత్సరాల బాలికల జట్టు ప్రథమ స్థానం సాధించగా, 14 సంవత్సరాల బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించింది. వాలీబాల్‌లో 17 సంవత్సరాల బాలుర, బాలికల జట్లు ద్వితీయ స్థానాలు సాధించాయి. చెస్‌లో 17 సంవత్సరాల బాలుర విభాగంలో విద్యార్థి ప్రథమ స్థానం సాధించాడు. మండల స్థాయి క్రీడల్లో విద్యార్థులు కనబరిచిన ప్రతిభ పట్ల పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎక్కలదేవి మల్లేశం హర్షం వ్యక్తం చేశారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు మరింత కష్టపడి సాధన చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఐ. కనకదుర్గ, గ్రామ సర్పంచ్ పడమటి మమత నరేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ నారగోని అశోక్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ చేగూరి పద్మమ్మ, గ్రామ పెద్దలు, యువకులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణకు మాతృవియోగం

**బోనకల్, సెప్టెంబర్ 12 (దేశ టైమ్స్):**



తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, బోనకల్లు మండల టీడీపీ అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ తల్లి సీతమ్మ (90) శనివారం ఉదయం వయోభార సమస్యలతో బ్రాహ్మణపల్లిలోని స్వగృహంలో మృతి చెందారు. సీతమ్మ మృతి విషయం తెలుసుకున్న ఖమ్మం పార్లమెంటరీ టీడీపీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తండ్రి మృతి చెందిన రెండు వారాలకే తల్లిని కోల్పోవడం ఎంతో బాధాకరమని పేర్కొంటూ సత్యనారాయణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం పాలేరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కొండబాల కరుణాకర్, మధిర పట్టణ టీడీపీ అధ్యక్షుడు మల్లాది హనుమంతరావు, జిల్లా తెలుగురైతు మాజీ అధ్యక్షుడు నందమూరి సత్యనారాయణ, ఐటీడీపీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వేమూరి సునీల్, జిల్లా తెలుగుయువత బాధ్యులు మైనేని రవి, బ్రాహ్మణపల్లి టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు పాటిబండ్ల సుబ్బారావు, ఐటీడీపీ జిల్లా బాధ్యులు షరీఫ్, టీడీపీ నాయకులు కర్నాటి అశ్వనీ కుమార్, నాగార్జున శ్రీనివాసరావు, కామినేని శ్రీనివాస్, మరీదు బరకయ్య, తాత సుధాకర్, కాంగ్రెస్ నాయకుడు కందుల పాపారావు తదితరులు సీతమ్మ పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

# మరిపెడలో నూతన కోర్టు భవనం పరిశీలన






**మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష**

**దేశ టైమ్స్ మహబూబాబాద్‌మరిపెడ, సెప్టెంబర్ 12:**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన కోర్టు భవనాన్ని మహబూబాబాద్ జిల్లా న్యాయమూర్తి మురళీమోహన్ శనివారం పరిశీలించారు. నూతన కోర్టు భవనంలో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి, కోర్టు కార్యకలాపాలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి కోర్టు భవనంలోని వివిధ విభాగాలను సందర్శించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలపై ఆరా తీశారు. కోర్టు కార్యకలాపాలకు అనుగుణంగా భవనంలో అందుబాటులో ఉన్న వసతులు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత తదితర అంశాలను పరిశీలించినట్లు తెలిసింది. నూతన కోర్టు భవనం అందుబాటులోకి రావడంతో మరిపెడతో పాటు పరిసర మండలాలు, గ్రామాల ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువ కానున్నాయి. న్యాయపరమైన వ్యవహారాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో ప్రజలకు సమయం, ప్రయాణ వ్యయం ఆదా కానుంది. స్థానికంగానే న్యాయ సేవలు అందుబాటులోకి రావడం వల్ల కక్షిదారులకు మరింత సౌకర్యం కలగనుంది. కోర్టు నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పించడంతో పాటు భద్రతా చర్యలను పటిష్టంగా చేపట్టాలని జిల్లా న్యాయమూర్తి సంబంధిత అధికారులకు సూచించినట్లు సమాచారం. కోర్టుకు వచ్చే ప్రజలు, న్యాయవాదులు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించినట్లు తెలిసింది. కోర్టు భవనం పరిసరాల్లో పారిశుద్ధ్యం, వాహనాల పార్కింగ్, భద్రత, ప్రజల రాకపోకలకు అనుకూలమైన ఏర్పాట్లపై కూడా దృష్టి సారించాలని అధికారులతో చర్చించినట్లు సమాచారం. నూతన భవనంలో కోర్టు కార్యకలాపాలు సమర్థవంతంగా కొనసాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సమన్వయంతో చేపట్టాలని సూచించినట్లు తెలిసింది. ఈ పరిశీలన కార్యక్రమంలో మరిపెడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎల్.పవన్ కుమార్, తహసీల్దార్ కృష్ణవేణి, మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి, అడ్వకేట్ సైదులు, లాలు తదితరులు పాల్గొన్నారు.



## నా సినిమాలను నేను చూడలేను: ప్రీతి జింటా

**కొంత విరామం తర్వాత గ్రాండ్ రీఎంట్రీ ఇస్తున్న ప్రీతి జింటా**

**స్క్రీన్ పై తనను తాను చూసుకోవడం ఇబ్బందికరంగా ఉంటుందని వెల్లడి**

**సీన్ ఇంకా బాగా చేసి ఉంటే బాగుండేదని అనిపిస్తుందన్న ప్రీతి**

ప్రముఖ బాలీవుడ్ నటి ప్రీతి జింటా కొంత కాలంగా సినిమాలకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. కొంత విరామం తర్వాత ఆమె 'వైబ్' అనే యాక్షన్ కామెడీ మూవీతో పాటు 'బట్వారా 1947' చిత్రం గ్రాండ్ రీఎంట్రీ ఇస్తోంది. 'వైబ్'లో ఆమె 'మేడమ్ హెచ్' అనే పవర్‌ఫుల్ సూపర్ స్పై పాత్రలో కనిపించనున్నారు. వంశిక ధీర్, కునాల్ ఖేము, స్పర్ష్ శ్రీవాస్తవ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా జరిగిన ప్రమోషన్లలో నటి వంశిక ధీర్ మాట్లాడుతూ... పెద్ద తెరపై తనను తాను చూసుకున్నప్పుడు 'ఇంపాస్టర్ సిండ్రోమ్' అనిపించిందని చెప్పగా, ప్రీతి జింటా ఆసక్తికరంగా స్పందించింది. ఇన్ని ఏళ్ల అనుభవం ఉన్నా, ప్రతి కొత్త పాత్ర చేసేటప్పుడు 'చేయగలనా, లేదా?' అనే సందేహం తనకూ వస్తుందని ఆమె చెప్పింది. "నేను నా సినిమాలను స్క్రీన్ పై ఎప్పుడూ చూడలేను. థియేటర్‌లో కూర్చోవడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. సినిమా చూస్తున్నంతసేపు ఈ సీన్ ఇంకా బాగా చేసి ఉంటే బాగుండేది అనే ఆలోచనే వస్తుంది" అని ప్రీతి వెల్లడించింది.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280